విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 03 ఫిబ్రవరి 2025 8 పేజీలు

పల్లెలకూ... ఆన్‌లైన్ సరకులు

- గ్రామాలకు విస్తరించిన ఈ-కామర్స్ వ్యాపారం
- సమయం ఆదా...
- ఇంటి వద్దకే కావలసిన వస్తువులు..

గ్రామాలలో ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న కొద్దీ ఈ-కామర్స్ వేగంగా విస్తరి స్తోంది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ షాపింగ్...ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలోనూ సర్వసాధారణమవుతోంది. పట్టణాలలో లభించే అన్ని రకాల ఉత్పత్తులు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలో కూడా కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉన్నాయి.దుకాణాల చుట్టూ తిరగకుండా ఇంటి నుంచి కావలసిన వస్తువులను ఆర్డర్ చేస్తున్నారు.ఇందుకోసం చాలా వెబ్ సైట్లు,యాప్ లు ఆకర్షణీయమైన ఆఫర్లు,డిస్కౌంట్లు అందిస్తున్నాయి. క్యాష్ ఆన్ డెలివరీ,డెబిట్, క్రెడిట్ కార్డులు వంటి అనేక చెల్లింపులకు ఆప్షన్లు ఉన్నాయి.ఈ-కామర్స్ ద్వారా ఇంటి నుంచే ఆర్డర్ నమోదు చేయగానే తమకు నచ్చిన వస్తువు వచ్చి చేరుతోంది.నచ్చకపోయినా,నాణ్యత లేకపోయినా తిరిగి పంపే అవకాశం కూడా ఇందులో ఉంటోంది.అందుకే జనం ఈ-కామర్స్ వైపు మొగ్గు చూపుతున్నారు.

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : నిత్యావసర వస్తువులు మొదలుకొని ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు ఇంట్లో అవసరమైన అన్ని వస్తువుల కొనుగోలుకు వివిధ ఈ-కామర్స్ సంస్థలు వేదికలుగా నిలుస్తున్నాయి. ఈ సంస్థలకు అనుబంధంగా జిల్లా కేంద్రాలలో, పట్టణ కేంద్రాలలో కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు వెలిశాయి.వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. వీటితో స్థానిక యువతకు ఉపాధి లభి స్తోంది.వస్తువులను సకాలంలో డెలివరీ చేయడానికి నిర్వాహకులు ద్విచక్ర వాహనాలు ఉన్న వారిని నియమించుకుంటున్నారు.యువకులు,విద్యావంతులు,మహిళలు,వ్యాపారస్తులు,ఉద్యోగులు, ప్రస్తుతం ఈ-కొనుగోళ్ల విధానం వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు.అధిక శాతం ఇంట్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఉపయోగించే ప్రతి వస్తువు కొనుగోలు చేస్తున్నారు.

ఆన్ లైన్ వ్యాపారం ఇలా...

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రతిరోజు కొనుగోలుదారులు వివిధ వస్తువులకు సంబంధించిన ఆర్డర్లు పెడుతున్నారు. సగటున రూ.30 నుంచి 40 లక్షల వరకు కొనుగోళ్ల లావాదేవీలు జరుగుతున్నాయి.పండుగ సమయాలలో అయితే ఈ కొనుగోళ్ల మొత్తం రూ.60 లక్షలకు చేరుతోంది.ఉమ్మడి జిల్లాలో ఆన్ లైన్ కొరియర్ సంస్థలు 30 వరకు ఉన్నాయి.ఈ-కామర్స్ ద్వారా సుమారు 5వేల మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు.

అమ్మకమవుతున్న వస్తువులు...

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈ-కామర్స్ ద్వారా పట్టణాలలో ఎక్కువగా స్మార్ట్ ఫోన్లు,ల్యాప్ టాప్ లు,స్మార్ట్ వాచ్ లు,దుస్తులు, చెప్పులు,బ్యాగులు,ఆభరణాలు, ప్రధానంగా చీరలు,ఫ్యాషన్ డ్రెస్ మెటీరియల్, ఆహార పదార్థాలు,రోజువారి ఉపయోగించే వస్తువులు,కాస్మోటిక్స్,హెయిర్ కేర్ ఉత్పత్తులు అమ్మకం అవుతున్నాయి. ఈ-కామర్స్ లో తమకు కావలసిన వస్తువులకు ఆర్డర్ చేయడంలో ఇటీవల కాలంలో పల్లె ప్రజలు కూడా పట్టణ ప్రాంత ప్రజలతో పోటీపడుతున్నారు.ప్రధానంగా వ్యవసాయానికి సంబంధించిన ఉపకరణాలు సైతం ▶మిగతా 2లో..

11 ఏళ్లుగా బడ్జెట్‌లో
యువతకు మొండి చేయి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర - పాలకొల్లు : నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రం లోని నరేంద్ర మోడీ ప్రభుత్వం బడ్జెట్ లో మొండిచేయి చూపించదని, యవత ఆశలు అడియాసలు చేసిందని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు.ఆదివారం పాలకొల్లు ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా సమితి సమావేశంలో కోనాల భీమారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సమావేశానికి ఎఐవైఎఫ్ జిల్లా నాయకుడు పద్మనాభుని పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామని నమ్మబలికి అధికారం చేపట్టిన నరేంద్ర మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలుగా బడ్జెట్‌లో మొండి చేయి చూపుతుందని విమర్శించారు. దేశ సంపదను కార్పోరేట్ లకు దోచి పెట్టడమే ధ్యేయంగా పాలన సాగిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం, ఉద్యోగావకాశాలు కల్పన లాంటి సమస్యలపై ఎఐవైఎఫ్ నిర్విరామంగా, దేశ వ్యాపితంగా పోరాడుతుందని అన్నారు.ఈనెల 6 నుంచి 9 వ తేదీ వరకు ఎఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలు శ్రీకాకుళంలో జరుగనున్నాయన్నారు.ఈమహాసభల్లో జిల్లా నుంచి యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని భీమారావు కోరారు.ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం. సీతారాం ప్రసాద్,తదితరులు మాట్లాడారు. అనంతరం ఎఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షునిగా తాడి విన్నీ విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా పద్మనాభుని పవన్ కుమార్, ఉపాధ్యక్షునిగా, గరికి సాధుశేఖర్, సహాయ కార్యదర్శిగా సాయి,కోశాధికారిగా యలమల సంసోను,కార్యవర్గ సభ్యులుగా జి. షాలేం బెన్సర్,కె.వీరేంద్ర కుమార్,ఎన్. సందీప్,ఎస్. సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు.

గిరిజనుల నివాస స్థలాలకు
పట్టాలు మంజూరు చేయాలి

ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం : రామన్నగూడెం గిరిజనులకు అన్ని మౌలిక వసతులు కల్పించి, వారు నివాసం ఉంటున్న స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. మండలంలోని రామన్నగూడెంలో ఆదివారం సీపీఐ, బికేఎంయు, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు ఆధ్వర్యంలో పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలము ఇచ్చి, గృహ నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ అక్కడి ప్రజలతో దరఖాస్తులు పూరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో 4-1 సర్వే నెంబర్‌లో రామన్నగూడెంకు చెందిన 180 గిరిజన కుటుంబాలు గృహాలను నిర్మించుకొని జీవిస్తున్నారని వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి పట్టాలు మంజూరు చేయాలని ▶మిగతా 2లో..

అంతర్‌జిల్లా దొంగ అరెస్టు

- 48 బైకులు స్వాధీనం
- ఎస్పీ బిందుమాధవ్ వెల్లడి

విశాలాంధ్ర - పిఠాపురం : కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ పోలీసులు చోరీకి గురైన 48 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా పిఠాపురం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా మాస్కులు పెట్టి ఓ ముఠా బైకులు చోరీ చేస్తోందని, వారిలో అంతర్ జిల్లా దొంగను పిఠాపురం సర్కిల్ పోలీసులు పట్టుకున్నారన్నారు. అతడి దగ్గర నుంచి 48 బైకులు స్వాధీనం చేసుకున్నారు. దుండగుడు పిఠాపురానికి చెందిన సొంటిని గంగాధర్ అలియాస్ రీసు గంగాధర్‌గా గుర్తించారు. గతంలో పిఠాపురం, తుని, కాకినాడ, సర్కిల్‌తో పాటు అనకాపల్లి జిల్లాలో పలు బైకులు గంగాధర్ చోరీ చేశాడు. సీసీ ▶మిగతా 2లో..

దొమల దండయాత్ర ప్రజలు బెంబేలు 8లో

ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు పీజీఆర్ఎస్ నిలుపుదల 2లో

- కలెక్టర్ వెట్రిసెల్వి

పల్లెలకు ఆన్‌లైన్ సేవలు

(మొదటి పేజీ తరువాత)

అమ్ముడవుతున్నాయి. ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల ఆర్డర్లు కూడా పెరిగాయి.ఫ్లిప్ కార్ట్,అమెజాన్ వంటి ఈ-కామర్స్ వెబ్ సైట్ ల లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన బెస్ట్ సెల్లర్స్ జాబితాలను పరిశీలించినప్పుడు ఎక్కువగా ఈ వస్తువులే కనిపిస్తు న్నాయి. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు ఆన్‌లైన్‌లో మంచి డిమాండు.

సవాళ్లు.... గ్రామీణ ఈ-కామర్స్‌కు సంబంధించి కొన్ని ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఆ ప్రాంత ప్రజలు ఈ-కామర్స్ లో తమకు ఇష్టమైన వస్తువులను ఆర్డర్ పెట్టుకోలేకపోతున్నారు.ఒకవేళ పెట్టుకున్నా ఏజెన్సీలు ఆ ప్రాంతాలకు డెలివరీలను బుక్ చేసుకోవడం లేదు.డెలివరీ బాయ్స్ కూడా అంత దూరం వెళ్లడానికి ఇష్టపడటం లేదు.గ్రామీణ ప్రాంతాలలో ఉత్పత్తులను సకాలంలో డెలివరీ చేయడం కొన్నిసార్లు కష్టమవుతోంది. అందరికీ స్మార్ట్ ఫోన్ లు లేకపోవడం ఆన్ లైన్ షాపింగ్ గురించి తెలియక పోవడం వల్ల ఈ వ్యాపారం పని ప్రాంతాలలోని గ్రామీణులకు చేరువ కాలేకపోతున్నది.

పట్టాలు మంజూరు చేయాలి

(మొదటి పేజీ తరువాత)

ఆయన డిమాండు చేశారు. 30 ఏళ్లగా 180 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్న ఆ భూమిని,దేవుడు మాన్యం భూమంటూ సాకులు చెబుతూ అధికారులు గిరిజనులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆ భూమి వివాదం కెఆర్ పురం ఐటిడిఏ పరిధిలోని ఎస్టిసి కోర్టులో విచారణకు ఉందని అధికారులు స్పందించి విచారణ చేపట్టి అక్కడి గిరిజనులకు మౌలిక సదుపాయాలు కలగజేయాలని ఆయన అన్నారు.ఏజెన్సీ ప్రాంతంలో ఏ మూల చూసిన రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించి తక్షణమే రోడ్లను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.పేద ప్రజలు నివాసం ఉండటానికి మూడు సెంట్లు స్థలమును ప్రభుత్వం కేటాయించి అందులో గృహ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బికెయంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, మన్నవ యామిని, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్న బాబు, సీపీఐ బుట్టాయిగూడెం మండల నాయకురాలు చోడెం దుర్గ, బుద్దుల ముత్యాలమ్మ, మునీశ్వరరావు, శ్రీనివాస్,మోహన్,అశోక్ కుమార్ పాల్గొన్నారు.

విద్యకు కేటాయింపులేవీ...

-ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశం

విశాలాంధ్ర - భీమవరం : విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు ఆశా జనకంగా లేవని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశం విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏభై లక్షల కోట్లు దాటిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 1,28,650 కోట్లు కేటాయించడాన్ని తప్పుపట్టారు. జీడీపీలో ఆరు శాతం విద్యారంగానికి కేటాయించాలని కొఠారి కమిషన్ సిఫార్సులను పట్టించుకోవడంలేదని ఆయన విమర్శించారు. ఏభై వేల పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబులు ఏర్పాటు చేస్తామనడం మంచి విషయమని దీనివల్ల ప్రయోగాత్మక బోధనకు వీలు కలుగుతుందని వెంటనే వాటిని ఆచరణలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

(మొదటి పేజీ తరువాత)

పుటేజ్ ఆధారంగా గంగాధర్‌ని పట్టుకోవడంలో పిఠాపురం పోలీసులు చక్కని ప్రతిభ కనబరిచారని ఎస్పీ తెలిపారు. అదే విధంగా గంగాధర్ వద్ద బైకులను కొనుగోలు చేసిన ఆరుగురు వ్యక్తులను కూడా అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, పిఠాపురం పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి శ్రీనివాస్, పట్టణ ఎస్సై వడ్డాడి మణికుమార్, అడిషనల్ ఎస్సై షేక్ జానీ బాషా, యు కొత్తపల్లి ఎస్సై జి వెంకటేష్, పిఠాపురం రూరల్ ఎస్సై ఎల్ గుణశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు పిజిఆర్ఎస్ నిలుపుదల : కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేసినట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఏలూరు కలెక్టరేట్ కార్యాలయం, జిల్లాలోని అన్ని డివిజన్, మండల, మున్సి పల్ కార్యాలయాల్లో జరుగు పిజిఆర్ఎస్ తాత్కాలికంగా రద్దు చేశామని తెలి పారు. ఎమ్మెల్సీ ఎన్ని కలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడు దల చేసింది. ఈనెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తారని ఓట్ల లెక్కింపు కార్యక్రమం మార్చి 3వ తేదీన జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ మార్చి 8వ తేదీన ముగుస్తుంది.

మోసపూరిత బడ్జెట్

- సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - ఏలూరు : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ దేశ ప్రజలను మోసం చేసే విధంగా ఉందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తుందని,అధిక ధరలతో అల్లాడుతున్న సామాన్యుడికి ఊరట కలిగించడానికి బదులు కార్పొరేట్ లకు మరిన్ని పన్ను రాయితీలు ఇచ్చిందని మండిపడ్డారు. ఉపాధి హామీకి మరోసారి నిధుల లేమితో తూట్లు పొడిచిందన్నారు. భీమా రంగంలో 100 శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించడం,ప్రభుత్వ రంగ సంస్థల నుండి వైదొలగడం, ప్రభుత్వ రంగ ఆస్తుల విక్రయాన్ని పెద్ద ఎత్తున చేపట్టడం ప్రైవేటీకరణను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం దేశ ప్రజల జీవన ప్రమాణాలను మరింత కుంగ తీయడమేనని నిజమే ధ్వజమెత్తారు. మధ్య తరగతికి గొప్ప వరంగా ఇచ్చామని చెబుతున్న ఆదాయ పన్ను పరిమితి రూ.12 లక్షలకు పెంచడం, సంపన్నులకు ఇచ్చిన రాయితీలతో పోలిస్తే సముద్రంలో నీటి బిందువు లాగా ఉందని ఎద్దేవా చేశారు.ఆహార సబ్సిడీ,విద్య, గ్రామీణాభివృద్ధి తో పాటు పలు రంగాలకు నిధులను కోత పెట్టడం దారుణం అన్నారు.జిల్లాకు సంబంధించి పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం,నిర్వాసితుల పరిష్కారానికి నిధులు, కేటాయింపులు లేవన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, కేంద్రీయ విద్యాసంస్థలకు నిధులు కేటాయింపులపై కనీసం ప్రస్తావన చేయలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుకు ఆశించినంతమేర నిధులు కేటాయించకపోగా, ప్రాజెక్టు ఎత్తును 45.72 మీటర్ల నుండి 41.15 మీటర్లకు తగ్గించడానికి కేంద్రం నిర్ణయించడం వలన రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని విమర్శించారు. ఎత్తు తగ్గించడం వలన నీటి నిల్వ సామర్థ్యం తగ్గి రిజర్వాయర్ గా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రాజెక్ట్ యధావిధిగా 45.72 గా ఉండాలని డిమాండ్ చేశారు.రైతుల పంటల కు కనీసం మద్దతు ధర పట్ల ప్రకటన చేయకపోవడం దుర్మార్గం అన్నారు.ఉత్పత్తి రంగ అభివృద్ధి, కొనుగోలు శక్తి పెంచే చర్యలు బడ్జెట్లో ఎక్కడా ప్రస్తావించలేదని విమర్శించారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు కేటాయింపు జరుపుతున్నారు కానీ, ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. ప్రస్తుత బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మేలుకూర్చే విధంగా ఉందన్నారు.

బడ్జెట్‌తో ఒరిగేదేమీ లేదు

సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు

విశాలాంధ్ర - కామవరపుకోట : పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంకెల గారడి బడ్జెట్ అని ఈ బడ్జెట్ వలన దళిత బలహీన వర్గాలకు రైతు కూలీలకు ఒరిగిందేమీ లేదని సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డా రు.కార్పొరేట్ శక్తులకు కుమ్మకాస్తున్న బడ్జెట్ తప్ప ఈ బడ్జెట్ వలన కార్మిక శక్తులకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. యువజన విద్యార్థులకు మహిళలకు సాంస్కృతిక రంగానికి బడ్జెట్ కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి బడ్జెట్ ను పెంచకుండా ఉపాధి హామీ పథకానికి గండి కొట్టే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబానీ, ఆదాని లాంటి కార్పోరేట్ కనుసన్నలలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం బిజెపి పరిపాలన కాలంలో వారి అడుగులకు మడుగులతో వారి చెప్పు చేతల్లో నడిచే ప్రభుత్వానికి రాబోయే కాలంలో కార్పొరేటర్ శక్తుల ప్రభుత్వాన్ని కార్మిక శక్తుల ఐక్యమై ప్రభుత్వాన్ని తరిమి కొట్టడం ఖాయమని కేంద్రాన్ని హెచ్చరించారు.

క్షతగాత్రుడికి ఎమ్మెల్యే సాయం

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : జాతీయ రహదారి దర్భ గూడెం గ్రామం సబ్ స్టేషన్ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసు కుంది. కారు ,బైక్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. అటు వైపుగా వెళ్తున్న పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు వెంటనే స్పందించి క్షత గాత్రుడుని ఆసుపత్రికి తరలించేలా ఏర్పాటు చేశారు. ఎస్సై నవీన్‌కుమార్ తన వాహనంలో గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు.

ఏలూరు కాల్వ గట్టుపై ఆక్రమణల తొలగింపునకు

ఆదిలోనే అడ్డంకులు..!

- జేసీ, ఎస్పీ, ఇరిగేషన్ ఎస్ఈల సమన్వయంతోనే సమస్య పరిష్కారం
- తొలగింపు ప్రక్రియ తాత్సారం - మళ్లీ వెలుస్తున్న ఆక్రమణలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఏలూరు కాల్వ గట్టుపై ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగిం పునకు ఆదిలోనే హంసపాదు పడింది ఒకవైపున న్యాయస్థానం ఆదేశాలతో కొంతమంది స్వచ్చం దంగా ఆక్రమణలను తొలగించగా, మిగిలిన ఆక్ర మణల విషయంలో ఉన్నతాధికారులలో స్పందన కొరవడింది. దీంతో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించి రోడ్డునపడ్డ వారు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఏలూరు కాల్వ గట్టుపై జాతీయ రహదారి పక్కన ఉంగుటూరు, నారాయణ పురం, చేబ్రోలు ప్రాంతాలలో కొందరు ఆక్రమణ లను స్వచ్ఛందంగా తొలగించారు. కాల్వ గట్టుపై ఇరువైపులా మొత్తం 463 ఆక్రమణలుండగా, 135 మంది స్వచ్ఛందంగా తొలగించగా, అందులో 162 గృహాలు ఉన్నాయి. కాగా, 34 మంది న్యాయ స్థానాన్ని ఆశ్రయించడంతో ఆక్రమణల తొలగింపు నకు తాత్కాలికంగా స్టే వచ్చింది.

ఈ నేపథ్యంలో ఆక్రమణల తొలగింపు కమిటీ కన్వీనర్‌గా ఉన్న ఏలూరు డీఎల్‌పీఓ చంద్రశేఖర్ తొలగింపునకు అనేక తేదీలను ప్రకటించారు. ఒక సమయంలో ఆక్రమణ తొలగించాలని సిద్ధం చేసుకున్నారు. ఆ సమయంలో సిఐ , ఎస్ఐ అందుబాటులో

లేకపోవ డంతో ఆక్రమణలకు బ్రేక్ పడింది. వారు వచ్చిన తర్వాత ఆక్రమణల తొలగింపుపై సీఐతో డీఎల్‌పీఓ చర్చలు జరిపారు. ఆక్రమణ తొలగించాలంటే పోలీస్ బలగాలు ఉండా లని, ఎస్పీ ఆదేశాలు ఉం డాలని, నియమించిన 13 బృందాలకి ఒక్కొక్క తహశీ ల్దార్ పర్యవేక్షణ ఉండాలని, ఆక్రమిత ప్రాంత మంతా జలవనరులశాఖ పరిధిలో ఉన్నందున పర్య వేక్షక ఇంజనీర్ ఉండాలని సీఐ స్పష్టం చేశారు. మరోవైపు జాయింట్ కలెక్టర్, జిల్లా ఎస్పీ నుంచి కూడా ఆదేశాలు రావాల్సి ఉంది. ఈ మూడు శాఖ ల మధ్య సమన్వయం సమావేశం జరిగితే తప్ప ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ముందుకు సాగే సూచనలు కనిపించడంలేదు. ఇక నోటీసులకు స్పందించకుండా,.ఆక్రమణలు తొలగించనివారు దర్జాగా తమ వ్యాపారాలు కొనసాగించు కొంటు న్నారు. తొలగించిన కొందరైతే మళ్లీ తొలగించిన చోటనే తాత్కాలికంగా టిప్ టాప్ పందిర్లు వేసి, హెూటల్స్ కూడా నడుపుతున్నారు. అయితే కైకరం లో ఒక్కరు కూడా స్వచ్ఛందంగా ఆక్రమణ తొలగిం చుకోలేదు.

ఆక్రమణలు తొలగిస్తామని ప్రకటించిన రెవెన్యూ అధికారులు గాని, పంచాయతీ అధికా రులుగానీ ఇవన్నీ తెలిసినా మౌనం దాల్చడం గర్హనీయం.

ఇన్‌చార్జ్ తహశీల్దారుగా ప్రసాద్ నియామకం

విశాలాంధ్ర – లింగపాలెం : లింగపాలెం మండల డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్‌ను ఇన్చార్జి తహశీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ వెట్రీ సెల్వి ఆదేశాలు ఇచ్చారు. మండలంలో రెగ్యులర్ తహసీల్దారుగా పనిచేస్తున్న నజీమును కలెక్టర్ కార్యాలయంలోని భూముల పరిష్కార సెక్షన్ కు ఇన్చార్జిగా బదిలీ చేశారు. రెండు రోజులపాటు కే.కోట మండల తహసిల్దార్ ఎలీషా కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. వేరే మండలానికి చెందిన తహశీల్దారుని నియమించడంవల్ల విధుల నిర్వహణకు అంతరాయం వాటిల్లుతుందని భావించిన అధికారులు లింగపాలెం మండల రెవెన్యూ కార్యాలయంలోని డిప్యూటీ తహసిల్దార్ కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు.

సక్రమంగా పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర – లింగపాలెం : లింగపాలెం మండలంలో పింఛన్ల పంపిణీ సక్రమంగా జరిగిందని ఎంపీడీవో వాణి తెలిపారు. మండలంలో 7,845 మంది పెన్షన్లు తీసుకుంటున్నారని తెలిపారు. ఎవరికి పెన్షన్లు తొలగించలేదని దీనిపై ఎటువంటి అపోహలు వద్దని అన్నారు. మొదటి రోజు 6,720 మందికి పింఛన్లు అందించినట్లు తెలిపారు.పెన్షన్ అందుకోలేని వారికి సోమ, మంగళవారాలలో అందజేస్తామని అన్నారు. ఉదయానికే పెన్షన్లు అందించడం జరిగిందని పెన్షన్ దారులకు ఇబ్బంది లేకుండా పంపిణీ జరిగిందని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

విశాలాంధ్ర – భీమడోలు : మండల పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి భీమడోలు అయ్యప్ప తాపీమేస్త్రి సంక్షేమ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం నాయకులు తెలిపారు. భీమడోలులో భవన నిర్మాణ రంగంలో పని చేస్తూ దురదృష్టవశాత్తు మృతి చెందిన పొగిరి మారుతి కుమార్,గంట గంగరాజు,గుర్రాల సురేష్ కుటుంబ సభ్యులకు అయ్యప్ప తాపీమేస్త్రి సంక్షేమ సంఘం ఒక్కో కుటుంబానికి రూ. 5వేలు చొప్పున నగదు, 50కేజీల బియ్యాన్ని సంఘ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేసారు. కార్యక్రమంలో కోటిపల్లి సీతారామయ్య, ఈతకోట తాతాజీ,కేతినేని సోమరాజు,గాదం రాము, చిన్నం నాని, ఎస్.కె.నాగూర్, కోయ రత్తయ్య, పసుపులేటి రమేష్, నరం యేసు, గంట ప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరం పై దాడులు

రూ.5,300 నగదు, 6 ద్విచక్ర వాహనాల స్వాధీనం

విశాలాంధ్ర – ఆగిరిపల్లి : చిన్న ఆగిరిపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి రూ.5,300, ఆరు చక్రవాహనా లను స్వాధీనం చేసుకుని, 8 మం దిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శుభశేఖర్ ఆదివారం తెలి పారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ మాట్లాడుతూ మండల పరిధిలో ఎవరైనా కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచా రాన్ని డయల్ 112కు, ఆగిరిపల్లి ఎస్ఐ నెంబర్ 94407 96444 అంద జేసిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర – టి నరసాపురం : గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు బివిఎస్ సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. టి నరసాపురంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో గిరిజన గ్రామాలైన మర్రి గూడెం, అబ్బుల్లాపురం, మల్లప్ప గూడెం, రామమ్మ గూడెం, బచ్చులేటి గూడెం, సొలిగూడెం వంటి గిరిజన గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని ఆయన తెలిపారు.ఇప్పటికైన అధికారులు స్పందించి గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలి అన్నారు.

మీకోసం రద్దు : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర – భీమవరం : నేడు ఫిబ్రవరి 3వ తేదీ నుండి మార్చి 8వ తేదీ లోపు ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 3 నుండి మార్చి 8 వ తేదీ లోపు ప్రతి సోమవారం జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను (పిజిఆర్ఎస్) జిల్లా అంతట తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. తదుపరి పిజిఆర్ఎస్ నిర్వహించే తేదీని ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుందని, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు దృష్టిలో ఉంచుకొని సహకరించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

విశాలాంధ్ర – పాలకొల్లు : 21 మంది ఎంపీలతో పెద్దన్న పాత్ర పోషించే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బడ్జెట్ విషయంలో చిన్నచూపు చూశారని, బీహార్‌ను మాత్రం అందలం ఎక్కించి, ఆంధ్రకు గుండు సున్నా ఇచ్చారని పాలకొల్లు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కొర్ర గంజల హరికిరణ్ అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఈ సారి కూడా ప్రత్యేక హోదా ప్రస్తావన లేకుండా రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బ తీశారన్నారు. రాజధాని అమరావతికి గతంలో ఇచ్చిన రుణం తప్ప, ఇప్పుడు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్రాలకు సర్వసాధారణంగా ఇచ్చే అరకొర కేటాయింపులు, విదిలింపులే తప్ప ఏపీకి ఉపయోగపడే ప్రాజెక్టును ఒక్కటంటే ఒక్కటి కూడా ప్రకటించలేదన్నారు.

దాతల సహకారంతో గ్రామ దేవతల జాతరలు నిర్వహించాలి

ఎమ్మెల్యే ధర్మరాజు

విశాలాంధ్ర – గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే గ్రామ దేవతల జాతరను దాతల సహకారంతో నిర్వహించాలని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గణపవరం గ్రామ దేవత దండు మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఈ జాతర నిర్వహణకు గణపవరం టౌన్ జనసేన నాయకులు తమ వంతు విరాళంగా ఒక లక్ష రూపాయలను ఎమ్మెల్యే ధర్మరాజు చేతుల మీదుగా ఆలయ నిర్వాహకులు అందజేశారు. విరాళం ఇచ్చిన జనసేన నాయకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గణపవరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు తోట శీను, గంటా అన్నవరం,సెల్ పాయింట్ ప్రసాద్, వెలగలేటి సుబ్రహ్మణ్యం సప్పారాంబాబు, ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు కొనిశెట్టి వెంకట రమేష్, సరిపల్లి చిన్న, కాపారం చిన్న, తోట పవన్, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును విమర్శించడం సరికాదు

విశాలాంధ్ర – జీలుగుమిల్లి : పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగి స్తుండగా కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ విమర్శించడం, బోరు కొడుతుందని అనడం కించపరిచే విధంగా మాట్లాడడం దారుణమైన విషయమని పోలవరం ఎమ్మెల్యే సిరి బాలరాజు అన్నారు. ఆదివారం బర్రింకలపాడులో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఎంతో అనుభవం ఉందని కానీ రాష్ట్రపతి ప్రసంగాన్నే విమర్శించడం పద్ధతి కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలోకి రాకుండా చూడాలని అన్నారు. రాష్ట్రపతికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు.కూటమి ప్రభుత్వంలో కేంద్రంలోని రాష్ట్రంలోనూ ప్రధాని నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పరిపాలన సాగుతుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నరేంద్ర మోడీ వాళ్లనే పూర్తి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి,ఏలూరు జిల్లా బిజెపి కార్యదర్శి చాత్రాతి ప్రసాద్,జీలుగుమిల్లి మండలం జనసేన పార్టీ అధ్యక్షులు పసుపు రాము, బిజెపి జిల్లా నాయకులు కరిబండి నాగరాజు, కొండపల్లి ప్రసాద్ నాయకులు గుజ్జు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కెఆర్‌కు సిస్కో అవార్డు

విశాలాంధ్ర – భీమవరం : ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశా లకు జాతీయస్థాయి సిస్కో నెట్వర్కింగ్ అవార్డు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.మురళీ కృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా సిస్కో నుండి వచ్చిన అవార్డును కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత వర్మకు అందించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అంతర్జాతీయ కంపెనీ సిస్కో ప్రతి ఏటా భారత దేశంలో అత్యుత్తమ కళాశాలలను గుర్తించి సిస్కో నెట్వర్కింగ్ అకాడమీ అవార్డులు ప్రదానం చేస్తుందని ప్రస్తుత సంవత్సరమునకు గాను తమ కళాశాలకు జాతీయ ఉత్తమ సిస్కో అకాడమీ అవార్డు లభించిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు చెప్పారు. ఈ అవార్డును అమెరికా నుండి వచ్చిన సిస్కో నెట్వర్కింగ్ అకాడమీ డైరెక్టర్ లిన్ బ్లూమర్, సిస్కో భారత దేశ సీ ఎస్ ఆర్ హెడ్ అనురాగ్ శ్రీవాత్సవ లు కళాశాలకు అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు. కళాశాల సిస్కో అకాడమీ హెడ్ డాక్టర్ రవి కిరణ్ వర్మ మాట్లాడుతూ కళాశాలలో సిస్కో అకాడమీ ద్వారా సీ, పైథాన్ ప్రోగ్రామింగ్, నెట్వర్కింగ్, సైబర్ భద్రత వంటి అనేక అంతర్జాతీయ సర్టిఫికెట్ కోర్సులు అదనంగా అందిస్తున్నామని తెలిపారు.

గుత్తుల కుటుంబానికి టీడీపీ ప్రమాద బీమా అందజేత

విశాలాంధ్ర – భీమవరం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుత్తుల వేణు కుటుంబ సభ్యులకు తెదేపా కార్యకర్తల సంక్షేమ ప్రమాద బీమా నిధి నుండి రెండు లక్షల రూపాయలు టిడిపి అందచేసింది. ఈ సందర్భంగా గుత్తుల వేణు కుటుంబ సభ్యులు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మీని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ తెలుగు దేశంపార్టీ సభ్యత్వం తీసుకొని ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలకు ప్రమాద బీమా అండగా నిలుస్తుందని తెలిపారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ టిడిపి సీనియర్ కార్యకర్త గుత్తుల వేణు రోడ్డు ప్రమాదంలో మరణించగా టిడిపి పట్టణ కమిటీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, వార్డ్ ఇంచార్జ్ ములుగుర్తి శ్రీనివాస్ స్థానిక టిడిపి నాయకులు వెంటనే స్పందించి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ తోట సీతారామ లక్ష్మి ద్వారా రాష్ట్ర పార్టీకి నివేదికలు త్వరితగతిన పంపించడంతో ఇన్సూరెన్స్ విడుదలై వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, కార్యదర్శి గూడూరి సుబ్బారావు, టిడిపి అంగన్వాడి డ్వాక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టిడిపి భీమవరం మండల అధ్యక్షుడు రేపు వెంకన్న టిడిపి నాయకులు ములుగుర్తి శ్రీనివాస్ మెంటే గోపి భూపతిరాజు బుజ్జిరాజు ఎద్దు యేసుపాదం ఎండి నౌషాద్ ఉప్పులూరి చంద్రశేఖర్ పామర్తి వెంకటరామయ్య పాల శ్రీరామదాసు ములుగుర్తి శివాని కోరిపల్లి శ్రీనివాస్ చౌదరి చోడిశెట్టి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఫౌండర్ చెన్నా త్రికళ విద్యార్థులకు, విద్యార్థినులకు ఆదివారం ఈ కార్యక్ర మం నిర్వహించారు. పెంటపాడుకి చెం దిన ఇద్దరు పేద విద్యార్థులకు సైకిళ్ళు దాత రాధిక సహాయంతో అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ జనార్దన్‌రావు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువుతున్న ఉదయ్ శ్రీనివాస్‌కి పెంటపాడు నుంచి తాడేపల్లిగూడెం కాలేజీకి రావడానికి ఎటువంటి సదుపాయం లేక త్రికళను సైకిల్ కావాలని కోరారని, అలాగే హర్ష ఐదో తరగతి విద్యార్థి కూడా సైకిల్ లేక ఇబ్బంది పడుతున్నట్లుగా తెలిసి సైకిల్ సహాయం చేయవలసిందిగా కుటుంబ సభ్యులు కోరారు. వారు ఇద్దరు కూడా పేద కుటుంబాలు, త్రికాళ స్పందించి దాత ద్వారా రెండు సైకిళ్లను వారికి మాజీ కౌన్సిలర్ కర్రి ప్రభాకర బాలాజీ, ట్రస్ట్ జనార్దన్ రావు , ఉమా దంపతులు అందజేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభాకర్ బాలాజీ మాట్లాడుతూ గత 12 సంవత్సరాల నుంచి త్రికళ స్థాపించిన సంస్థ ఎంతో మంది పేద విద్యార్థులకు, ఒంటరి మహిళలకు , వృద్ధాశ్రమాలకు, శరణాలయాలకు ప్రమాద బాధితులకు అనేక కార్యక్ర మాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద రావు మాస్టారు, ప్రకాష్ మాస్టారు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - కలిదిండి : ప్రముఖ గుండె వైద్య నిపుణులు బత్తిన. వెంకటేశ్వరరావు పుట్టినరోజు సంద ర్భంగా ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వెంకటేశ్వరరావుతో పాటు భీమవరం కు చెందిన ప్రముఖ డాక్టర్లు మానసిక వైద్యులు రమణారావు, సుభాష్, ఆర్థోపెటిక్ వైద్యులు నరేష్, వేణుగోపాల రాజు, గైనకాలజిస్ట్ లక్ష్మి మరియు కే.వీ త్రివేణి, గ్యాస్ట్రో సర్జన్ నీలాద్రిరాజు, పిల్లల మానసిక వైద్యులు శ్రీవిద్య, చాతి నిపుణులు అశ్విని కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ సిహెచ్ విక్రాంత్, విజయ్ ఆనంద్, ఎండ్రో కైనాలజీ హర్షవర్మ, నరాల వైద్యులు కిరణ్, ఈఎన్ టీ స్పెషలిస్టు బాలకృష్ణ రాజు, శంకర్, రామ కృష్ణ, క్యాన్సర్ వైద్య నిపుణులు సుధీర్ వర్మ, యూరాలజీ అశోక్ కుమార్, కిడ్నీ వైద్యులు అశోక్ వర్మ, పిల్లల వైద్యులు రాణి చంద్, జనరల్ ఫిజీషియన్ రాజేష్ కుమార్ వర్మ లతోపాటు స్థానిక డాక్టర్లు అమీర్ సుల్తానా, ఎస్. దీప్తి, బి. శ్రీనివాస్, ఏ. ప్రశాంతి, ఎస్కే. మస్తాన్ వలి తదితరులు పాల్గొని వెంకటేశ్వరావుకు సంఘీభావంగా వైద్య సేవలు అందించారు. దీనితో హైస్కూల్ ప్రాంగణం కార్పొరేట్ హాస్పిటల్‌ను తలపించింది. మండలం నలుమూలల నుండి దాదాపు 500 మందికి పైగా రోగులను పరీక్షించి వైద్య సహాయం అందించారు. అవసరమైన వారందరికీ బిపి షుగర్ పరీక్షలతో పాటు ఈసీజీ, గుండె స్కానింగ్, తదితర పరీక్షలను ఉచితంగా చేశారు. డాక్టర్ వెంకటేశ్వర రావు కలిదిండి హైస్కూల్ పూర్వ విద్యార్థి కావడంతో 1978-79 బ్యాచ్ కి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు తగిన ఏర్పాట్లు చేసి పర్యవేక్షించి, ఎవరికి ఏ రకమైన అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మెగా వైద్య శిబిరాలు నిర్వహించడానికి సహకరించిన వివిధ డాక్టర్లు మరియు స్నేహితులు శ్రేయోభిలాషులకు, వేదికకు అవకాశం ఇచ్చిన హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్, హెచ్ఎం స్టాఫ్‌కు డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా రిజిస్టర్ లంక. వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పోకల. జోగిరాజు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఆండ్రాజు. శ్రీనివాసరావు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంక. రత్నారావు, సిహెచ్. రవీంద్ర, నాయకులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

మంత్రి నిమ్మల రామానాయుడు

విశాలాంధ్ర - పాలకొల్లు : పాలకొల్లులో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు కానున్న డయాలసిస్ సెంటర్ వారం రోజుల్లో ప్రారంభమవుతుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం డయాలసిస్ సెంటర్ పనులు, రూ 12.60 కోట్లతో జరుగుతున్న కొత్త భవనం నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ పనులకు సంబంధించి సంబంధిత శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ డయాలసిస్ సెంటర్ కి సంబంధించి 90 శాతం పనులు జరిగాయని మరో మూడు రోజుల్లో మిగిలిన 10 శాతం పనులు పూర్తి అవుతాయని తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన డయాలసిస్ రోగులు అర్ధరాత్రి సైతం భీమవరం, ఏలూరు, రాజమండ్రి, తాడేపల్లిగూడెం , అమలాపురం వంటి ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తుందని దీంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారని మంత్రి తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నికల సమయంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ఇచ్చిన హామీని నెరవేర్చానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంజూరైన రెండు డయాలసిస్ సెంటర్లో ఒకటి పాలకొల్లు అని తెలిపారు. గత టిడిపి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో 50 పడక ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి కొత్త భవన నిర్మాణాలకు రూ 12.60 కోట్లు తీసుకు వచ్చానని తెలిపారు. సంవత్సరంన్నర లో పూర్తి కావలసిన ఈ పనులు దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారడంతో ఐదేళ్లయిన పూర్తి కాకపోగా జరిగిన పనులు నాణ్యత ప్రమాణాలతో నోచుకోలేదని , వర్షం వస్తే బీటలు తీసిన ప్రాంతాల్లో నీరు లీకేజ్ అవుతుందని మొత్తంగా విధ్వంసానికి గురైందని మంత్రి చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఈ పనులను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కొత్త భవనం నిర్మాణం ను సుందర వనంగా తీర్చిదిద్దేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాఖపరమైన ఇంజనీరింగ్ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వర్మ, నాయకులు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, మహమ్మద్ జానీ, మామిడి శెట్టి పెద్దిరాజు, ధనాన్ని సూర్య ప్రకాష్, వర్షం గణేష్, బిరుదుకోట శేఖర్, జగ్రోతు రాం బాబు, మల్లంపల్లి పకీర్ బాబు, చినిమిల్లి గణపతి, పాల్గొన్నారు.

శ్రీచైతన్య యాజమాన్యంపై
కఠిన చర్యలు తీసుకోవాలి
ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివకుమార్

విశాలాంధ్ర - చింతలపూడి : సెలవు రోజులలో కూడా తరగతులు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యంపై కఠిన చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆది వారం సెలవు ఉన్నా శ్రీచైతన్య యాజమాన్యం సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహించి విద్యార్థు లను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నా రని ఆగ్ర హం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో ఉన్న నారాయణ కళాశాల విద్యార్థి ఒత్తిడికి గురయ్యి విద్యార్థి చరణ్ మరణించిన ఘటన తెలి సినా కూడా ఆదివారం తరగతులను నిర్వ హించి, విద్యార్థులను మానసికంగా ఒత్తిడి చేస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండి పడ్డారు. తక్షణమే స్పందించి శ్రీ చైతన్య యాజ మాన్యంపై మండల విద్యాశాఖ అధికారి,జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి కఠినమైన చర్యలు తీసుకోవాలని శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ నాయకులు డి. సన్నీ, కె.రాజేష్, టీ.నాని, కె.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చలి పులి విజృంభణ

విశాలాంధ్ర - ఏలూరు : వారం రోజులుగా జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో దట్టంగా పొగ మంచు కురుస్తోంది. ప్రతిరోజు ఉదయం గం.9వరకు నగరం అంతా మంచు అలుముకునే ఉంటోంది. దట్టంగా ఉన్న పొగ మంచు వీడకపోవడంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. బారెడు పొద్దెక్కేంతవరకు భానుడి దర్శనం కావడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. రెండు పూటలా సూర్యోదయం, సూర్యాస్తమయం వేళల్లో18-24 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం గం. 5లకే చలి పులి విజృంభిస్తోంది. ఇక మధ్యాహ్నం వేళ 25-30 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతోంది. మధ్యాహ్నం వేళ ఉక్క పోత క్రమేపి పెరుగుతోంది. ఈ నెలాఖరు వరకు (మహాశివరాత్రి పండుగ) ఇదే రకమైన వాతావరణం కొనసాగవచ్చునని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

రాజకీయ పార్టీలు మోడల్ కోడ్‌ను విధిగా పాటించాలి

- నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ - రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - భీమవరం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో మోడల్ కోడ్‌ను రాజకీయ పార్టీలు తూచా తప్పక పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు కోరారు.భీమవరం కలెక్టరేట్ డిఆర్ఓ ఛాంబర్ నందు డిఆర్ఓ, ఏఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్, మోడల్ కోడ్ గురించి వివరించారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందన్నారు. ఈ నెల 3న ఎన్నికల నోటిఫికేషన్ కూడా జారీ అవుతుందన్నారు.నేటి 3 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు.13న నామినేషన్ల ఉపసంహరణ, 27న ఎన్నికల పోలింగ్ ఉంటుందని, పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారని అన్నారు.మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ఏలూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి కాగా, ఏఆర్వోలుగా ఆయా జిల్లాల డీఆర్వోలు వ్యవ హరిస్తారన్నారు. జిల్లాలో 69,884 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లుగా ఉన్నారన్నారు. 93 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు ఏలూరు కలెక్టరేట్లో ఉదయం గం.11 నుంచి మధ్యాహ్నం గం.3 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఐఎన్‌సి వంశి రెడ్డి, సీపీఎం ఎం.ఆంజనేయులు, బీఎస్పీ ఎం.రంగరాజు, టిడిపి ఎం.శ్యాంబాబు, జనసేన జయశివ, ఇన్చార్జి ఎలక్షన్స్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఏలేశ్వరం : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, భావితరాల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలోనే ఉంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. పదవి విరమణ చేసిన యుటిఎఫ్ నాయకుడు, స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెవిఎస్ ప్రకాశరావును సతీసమేతంగా ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమోఘమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు యు.సోమరాజు, యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు టిసంజీవ్, కె రవి, సీనియర్ నాయకులు జి సుందర్రావు, జట్ల సోమరాజు, మతికాని రాంబాబు పాల్గొన్నారు.

స్టేట్ లెవెల్ అబాకస్ పోటీలకు శ్రీ వాగ్దేవి విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - అమలాపురం : విశ్వం ఎడ్యుటెక్ హైదరాబాదు ఆదివారం స్థానిక శ్రీ వాగ్దేవి పాఠశాలలో అబాకస్, వేదిక్ మ్యాక్స్ జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సుమారు 200 మంది పైగా విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభను కనబరిచారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సలీం భాషా చేతులమీదుగా బహుమతులను అందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సలీంభాషా వివిధ పాఠశాలల నుండి బహుమతులను గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తూ తల్లిదండ్రులకు పాఠశాలలకు ఎన్నో ముఖ్య సూచనలు చేశారు. చదువులతోపాటు పిల్లలకు నైతిక విలువలతో కూడిన సభ్యత, సంస్కారం, సాంప్రదాయాలను అలవాటు చేయాలన్నారు. నీతి కథలను చక్కటి పద్యాలను నేర్పాలని, తద్వారా మంచి నడవడికను నేర్చుకొని మరెన్నో బహుమతులను గెలుచుకొని దేశ పేరు ప్రఖ్యాతలను నలు దిశలకు వ్యాపింప చేసే భావిభారత పౌరులుగా అవుతారని చక్కటి సందేశాన్ని ఇచ్చారు. శ్రీ వాగ్దేవి పాఠశాల నుండి వివిధ బహుమతులను గెలుపొందిన 11 మంది విద్యార్థులలో ఒకటవ తరగతికి చెందిన కే వికాస్, కే వర్షిని, రెండవ తరగతికి చెందిన జె భవిష్య, మూడవ తరగతికి చెందిన వై నక్షత్ర, నాలుగవ తరగతికి చెందిన పి ధన్యశ్రీ, ఐదవ తరగతికి చెందిన జివిఎస్ కార్తికేయ, టి లిఖిత్, ఏ సోక్షిత్లు 9న విజయవాడలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల డైరెక్టర్ పరసా భరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పరసా భరత్, ప్రిన్సిపాల్ డా శ్రీరామచంద్రమూర్తి, హెచ్ఎం పి సుబ్రహ్మణ్యం పాల్గొని విజేతలను అభినందించారు.

మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన నీలపు రాంబాబు (37) మల్లేపల్లి గ్రామ శివారు నీమ గుండాల చెరువు గట్టు వద్ద ఆదివారం ఉదయం చనిపోయినట్లు గండేపల్లి పోలీసులు తెలిపారు. రాంబాబు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మతిస్థిమితం లేకుండా తిరుగుతూ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు, కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూటమి అభ్యర్థిని గెలిపించండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఏలేశ్వరం : రానున్న ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీలు బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక టిడిపి నేత బొదిరెడ్డి గోపి కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ కూటమి శ్రేణులు విస్తృత ప్రచారం నిర్వహించి పేరాబత్తుల గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం పోలవరం, అమరావతి, రైల్వే జోన్, విశాఖ స్టీల్ ప్లాంట్, మెగా డీఎస్సీ వంటి అంశాల్లో చిత్తశుద్ధితో పనిచేస్తుందని యువత, భావితరాల భవిష్యత్తుకు పట్టభద్రులు ఎమ్మెల్సీగా రాజశేఖరంను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన జిల్లా నాయకుడు పెంటకోట మోహన్,

కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పెండ్రాల శ్రీను, యండగుండి నాగబాబు, కోనాల వెంకటరమణ, మాజీ జెడ్పిటిసి జ్యోతుల పెదబాబు, టిడిపి నాయకులు చిక్కాల లక్ష్మణరావు, సూతి బూరయ్య, కూటమి కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవ సంస్థ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర -దేవరపల్లి: దేవరపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును మర్యాద పూర్వకంగా రాష్ట్ర మానవత కన్వీనర్ బలుసు సత్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ అగ్నికి ఆహుతి అయిన బాధితుల కుటుంబాలకి నిత్యవసర సరుకులు, ఆర్థిక సహకారం, నిరుపేదలకు వైద్య సహాయానికి, పార్థివ దేహాలను శాంతి రథాల ద్వారా కైలాస భూమికు తరలించడం, బాడీ ఫ్రెజర్ అందించడం అనేక సేవా కార్యక్రమాలు కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా సేవలం దిస్తున్న మానవత సంస్థను అభినందించినారు. రిపబ్లిక్

డే వేడుకల్లో మానవతా సంస్థ రాష్ట్ర కన్వీనర్ బలుసు సత్యనారాయణ చేసిన విశిష్ట సేవలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశిష్ట సేవ ప్రశంసా పత్రం పురస్కారం అందుకున్న బలుసు సత్యనారాయణనీ ముప్పిడి వెంకటేశ్వరరావు అభినందించినారు. మరిన్ని సేవలు అందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మానవతా డైరెక్టర్ యాలమాటి సత్యనారాయణ, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం రద్దు : కమిషనర్

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) కార్యక్రమం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా రద్దు చేసినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం తూర్పు-పశ్చిమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ తెలిపారు. ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేయదలిస్తే సంబంధిత సచివాలయంలో మీకోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ సూచించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ఓటీపీ చెప్పమంటారా! : దేవాదుల

విశాలాంధ్ర - అమలాపురం : ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో ఆన్లైన్ చేసుకున్న అభ్యర్థులను అధికారులు ఫోన్ చేసి ఓటిపీ చెప్పమని అడుగుతున్నారని అలా ఓటిపి చెప్పవచ్చా లేదా జిల్లా కలెక్టర్ స్పష్టత ఇవ్వాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. అసలే ఓటిపి నెంబర్ చెప్పటం వల్ల తమతమ అకౌంట్లలో వున్న డబ్బులు పోతున్నాయని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్న సమయంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన శిక్షణ తరగతులు గురించి మాట్లాడుతూ విశ్వకర్మ యోజన పథకం ఆన్లైన్ చేసుకున్న జిల్లా వారీగా చేసుకున్న అభ్యర్థులకు జిల్లాలోనే శిక్షణ తరగతులు నిర్వహించాలని, వేరొక జిల్లాలో నిర్వహించే కాకినాడ జిల్లా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అంటూ అధికారులు చెబుతున్నారు. దీనివలన వేరే జిల్లాకు వెళ్లి శిక్షణా తరగతులు నిర్వహించాలంటే అభ్యర్థులు ఇబ్బందులకు గురి

కావాల్సి వస్తుందని, శిక్షణ తరగతి అధికారులు ఆన్లైన్ చేసుకునే అభ్యర్థులకు ఓటిపి చెప్పమని వేధిస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి ఆన్లైన్ చేసుకునే అభ్యర్థులకు జిల్లాల వారీగానే శిక్షణా తరగతులు నిర్వహించేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్కురి ఏసుబాబు, తవిటికి అరుణకుమార్, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, సత్తాల దుర్గారావు, కముజు సుందరరావు, పెదపూడి కృష్ణ, కూనవరపు వెంకటేశ్వరరావు, ఉండ్రాజపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం రద్దు : కలెక్టర్

విశాలాంధ్ర - కాకినాడ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా కాకినాడ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దుచేయడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం తూర్పు-పశ్చిమ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి సోమవారం జిల్లాలో మండల స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేయదలిస్తే సంబంధిత సచివాలయంలో మీకోసం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

శివాలయ, విష్ణాలయాల 13వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని రామవరం గ్రామ శివాలయ, విష్ణాలయాల 13వ వార్షికోత్సవం వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎక్కడైనా శివాలయం, విష్ణాలయం వేర్వేరు చోట్ల ఉంటాయి. ఈ గ్రామంలో మాత్రం పూర్వ కాలం నుంచి ఒకే చోట ఉన్నాయి. గ్రామంలోని రోడ్లు ఎత్తు కావడం ఆలయాలు పల్లానికి చేరుకోవడంతో గ్రామస్థులు అంతా కలిసి ఆలయాలను పునర్నించాలని తలిచి వాటిని తలపెట్టారు. అలా ఆ రెండు ఆలయాలను 2012వ సంవత్సరంలో పూర్తీ చేసి ప్రతిష్ట చేశారు. దీంతో ఈ ఏడాదికి ఆలయాలు నిర్మించి 13 ఏళ్లు అయ్యిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు, ఇతర గ్రామలకు చెందిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సహకారంతో భారీ అన్న సంతర్పణ నిర్వహించారు.

ఆదాయ పన్ను మినహాయింపుపై హర్షం

విశాలాంధ్ర-దేవరపల్లి: భారతదేశ ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ శనివారం పార్లమెంటులో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపె ట్టిన బడ్జెట్లో ఆదాయపు పన్ను మినహాయింపులకు సంబం ధించి సామాన్య ప్రజలకు, పెన్షనర్లకు ఉద్యోగులకు మేలు చేసే విధంగా వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం పట్ల రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి సూర్య ప్రకాశరావు హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల రాష్ట్రంలో ఉన్న 4 లక్షల మంది పెన్షనర్లలో 80 శాతం మందికి లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఆర్థిక శాఖామంత్రి నిర్మల సీతారామన్ కు ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా సౌభాగ్యవ్రతం

విశాలాంధ్ర -కొవ్వూరు : భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా సౌభాగ్యవ్రతం నిలుస్తుందని వజ్ర వనిత వాసవి క్లబ్ సభ్యులు బంగారు కాశి అన్నపూర్ణ అన్నారు. ఆదివారం కొవ్వూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు సౌభాగ్యవ్రతాన్ని నిర్వహించారు. లక్ష పసుపు కొమ్ముల పూజను నిర్వహించారు. మహిళలకు పసుపు కుంకుమలను, వస్త్రాలను వాయినాలుగా ఇచ్చారు.ఈ సందర్భంగా కాశీ అన్నపూర్ణ మాట్లాడుతూ భారతీయ మహిళలు పసుపు కుంకుమలకు మాంగల్యానికి ప్రాధాన్యతనిస్తారన్నారు. ప్రతి మహిళ పసుపు కుంకుమలతో అలంకరించుకుని నిండు సుమంగళిగా జీవించాలని కోరుతూ ఈ సౌభాగ్య వ్రతం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు విశేషంగా పాల్గొని వాయినాలను తీసుకున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం ఎల్లమిల్లి గ్రామానికి చెందిన పత్తిపాటి శ్రీను(42) శుక్రవారం గడ్డి మందు తాగి కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు శ్రీను గత కొన్నాళ్లుగా కిడ్నీ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదని మనస్థాపం చెంది చనిపోవాలని ఉద్దేశంతో గడ్డి మందు తాగినట్లు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి ఎస్సై శివ నాగబాబు తెలిపారు.

ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర -కొవ్వూరు : కొవ్వూరు పట్టణంలోని శ్రీనివాసపురం గోదావరి నది తీరాన వేంచేసియున్న శ్రీ ప్రకృతి రావణబ్రహ్మ బ్రహ్మసూత్ర శివాలయం నందు నిర్వహిస్తున్న మహా సౌరయాగం నాలుగవ రోజు సూర్య భగవానుడికి సూర్యోపాసకులు ఆదిత్య వర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం శ్రీ ఉష , సౌజ్ఞ, సమేత సూర్య నారాయణుడి ఉత్సవ విగ్రహాలను అశ్వ రథంపై కొవ్వూరు పట్టణ పురవీధుల గుండా మేళ తాళాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకుని విశేషంగా పూజలను నిర్వహించారు. శ్రీ ప్రకృతి రావణబ్రహ్మ బ్రహ్మసూత్ర శివాలయ నిర్వాహకులు అనపర్తి శివరామకృష్ణ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం సీతానగరం కాపురస్తులు **గుడపాటి వెంకట సత్యనారాయణ, తండ్రి రామన్న** అను మాకు సీతానగరంలో **2.00 ఎకరాల** భూమి కలదు. మా తండ్రి గారి పేరుతో ఉన్న **671/1955 రుగా** గల దస్తావేజు తీసుకుని జగ్గంపేట వస్తుండగా మార్గమధ్య పడిపోయినవి. వీటి పై ఎటువంటి లావాదేవీలు చేసిన చట్టరీత్యా నేరం. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు అందజేస్తారని కోరుతున్నాను.

అడ్రస్: గుడపాటి వెంకట సత్యనారాయణ
ఫోన్ నెంబర్. 80968 43593

పీజీఆర్ఎస్ రద్దు : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర రాజమండ్రి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి మధ్య పీజీఆర్ఎస్ కార్యక్రమంకు సంబంధించిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరగదని, ప్రస్తుతం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాల కోసం ఎన్నికల కమిషన్ సూచనలు చెయ్యడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ జేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల కారణంగా నిర్దిష్ట జిల్లాల్లో జిల్లా , డివిజన్, మండల స్థాయిలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ రద్దు అమలులో ఉంటుంది. ఫిర్యాదుల నమోదు కోసం సమీపంలోని సచివాలయాన్ని సందర్శించండన్నారు. ఎన్నికల కోడ్ ఎత్తివేయబడే వరకు ఫిర్యాదులను సమర్పించడానికి "మీకోసం" ఆన్‌లైన్ పోర్టల్‌ని ఉపయోగించడం జరుగుతుం దని పేర్కొన్నారు. ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనుకాకుండా ఉండేందుకు, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో పిజిఆర్ఎస్ నిర్వహించడం జరగనందున ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అర్జీలు ఇవ్వడానికి కలెక్టరేట్, డివిజన్, మండల కేంద్రాలకు రావద్దని తెలియ చెయ్యడం జరుగుతోంది.

సాధారణ ప్రజలపై పెరుగుతున్న బడ్జెట్ భారం : బాలేపల్లి

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : ఎనిమిదోవసారి యూనియన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి అభినందనలు తెలుపుతూ, బడ్జెట్ ప్రస్తావనలో ఆర్థిక, సామాజిక రంగాల మధ్య సమన్వయం లేకపోవడం, సాధారణ ప్రజలపై పెరుగుతున్న భారం తగ్గించే ప్రయత్నం చేయకపోవడం దురదృష్టమని కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్ పేర్కొన్నారు. ఆకాశాన్నంటిన నిత్యవసర ధరలు, పెట్రోల్ డీజిల్, మధ్య తరగతి ప్రజలు ఉపయోగించే వస్తువులు, జీఎస్టీ పరిధిలో మార్పులు చేసి సామాన్యులకు మేలు చేసే ఆలోచన చేయకుండా నేలను విడిచి సాగు చేసినట్లు బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాలకు అర కొర కేటాయింపులతో మొండి చేయి చూపించారన్నారు. విభజన హామీలైన రాష్ట్రానికి ఉక్కు పరిశ్రమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధుల కేటాయింపు ప్రస్తావన గాలికి వదిలారని తెలిపారు . పోలవరం ప్రాజెక్టు కేంద్రమే నిర్మించి ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ ఎన్నాళ్లకు పూర్తి చేస్తారు తెలియని సాగదీత ధోరణి పాటించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి పార్టీల సహకారంతో ముందుకు సాగుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కూటమి పార్టీలు పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పినప్పటికీ స్పష్టత కరువైందన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ ధనిక వర్గాల వారికి తప్ప పేద వర్గాల వారికి మేలు చేసేది కాదని అభిప్రాయపడ్డారు.

మాజీ ఎంపీ ముద్రగడ నివాసంపై దాడికి ముదునూరి ఖండన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కిర్లంపూడిలో ఆదివారం మాజీ ఎంపీ ముద్రగడ పద్మనాభం నివాసంపై జరిగిన దాడిని ఖండించిన ప్రత్తిపాడు నియోజవర్గ వైసీపీ నేత ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ సందర్భంగా కిర్లంపూడిలో ప్రత్తిపాడు నియోజవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నివాసం వద్ద మురళి రాజు మీడియాతో మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి, విచారణ చేపట్టి ఈ దాడిలో ఎంతమంది ఉన్నారో వారందరూ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈలాంటి దాడులు మంచి పని కాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐక్యతతోనే హక్కుల సాధన

విశాలాంధ్ర-కొవ్వూరు : ఐక్యతతోనే హక్కులను కాపాడుకోగలమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు డి దుర్గా ప్రసాద్ అన్నారు. ఆదివారం కాకి నాడ జిల్లాలో రాష్ట్ర అధ్యక్షులు కె ఆర్ సూర్యనారాయణ అధ్యక్షతన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమావేశానికి కొవ్వూరు నుండి ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు బయలుదేరి వెళ్లారు.

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే కేంద్ర బడ్జెట్

విశాలాంధ్ర -కొవ్వూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ ఉందని తూర్పుగోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పిక్కి నాగేంద్ర అన్నారు. ఆదివారం కొవ్వూరు పట్టణంలోని పిక్కి నాగేంద్ర నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో, విద్య ఆరోగ్య వ్యవసాయం, రవాణా,గ్రామీణ అభివృద్ధి పట్టణ అభివృద్ధి, రక్షణ రంగాలకు కేంద్ర బడ్జెట్లో కేటాయింపులు ఇవ్వడం హర్షదాయకమన్నారు, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్లపై బడ్జెట్ కేటాయించి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు సలాది సందీప్, కొవ్వూరు నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కన్వీనర్ మట్ల ఆంజనేయులు, 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, పొనంగి పవన్, తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమాపై నిర్లక్ష్యం తగదు

- గౌతమి కంటి ఆసుపత్రి నేతృత్వంలో జాతీయ సదుసు
- గ్లకోమాపై విదేశీ వైద్యులు అవగాహన
- బాల అందత్వ నివారణకు గౌతమి నేత్రాలయం సేవలు అభినందనీయం
- అమెరికా వైద్యులు డాక్టర్ థామస్ వి.జాన్సన్

విశాలాంధ్ర - రాజానగరం : గ్లకోమా వ్యాధిపై నిర్లక్ష్యం తగదనీ, తక్షణమే కంటి వైద్యులను సంప్రదించాలని అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయం నుంచి విచ్చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ థామస్ వి.జాన్సన్ అన్నారు. ప్రస్తుతం సమాజంలో గ్లకోమా బారిన పడుతున్న వారి సంఖ్య అధికం కావడంతో వాటి నిర్మూలనపై గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్ మరియు ఐ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలో నేత్ర, గ్లకోమా విభాగం వైద్యులకు కంటి సమస్యలపై నూతన వైద్యవిధానాలు అవలంబించడంపై ఆదివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ వైద్యులు డాక్టర్ ప్రజ్ఞ పరిశీలకురాలిగా వ్యవహరించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రెటీనా గ్యాంగ్లియన్ సెల్ (ఆర్జీసి)అనేది కంటి రెటీనా లోపలి ఉపరితలం అని (గ్యాంగ్లియన్ సెల్ పొర) దగ్గర ఉన్న ఒక రకమైన కణాల భర్తీ పై కీలక ఉపన్యాసం ఇచ్చారు. న్యూయార్క్ లోని కార్నెల్ మెడ్ సెంటర్ నుంచి విచ్చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ చార్లెస్ కోల్ మాట్లాడుతూ శస్త్రచికిత్స పితామహుడు సుశ్రుతుడు అందించిన శస్త్రచికిత్సా విధానాలు వివరించారు. గ్లాకోమాకు సంబంధించిన శస్త్రచికిత్సలను వివరించారు. గ్లకోమా యొక్క రెటీనా గ్యాంగ్లియన్ సెల్ పునస్థాపనను అతను వివరించారు.గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన వైద్యులు డాక్టర్ ఎ.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ గ్లాకోమా రోగులకు లేజర్ చికిత్స యొక్క అంతర్ దృష్టి సమస్యపై ప్రదర్శన రూపంలో ప్రసంగించారు. యుఎస్ నుండి నిష్ణాతుడైన పారిశ్రామికవేత్త, వైద్యులు డాక్టర్ శ్రీను మద్దుల మాట్లాడుతూ బాల్య అంధత్వ నిర్మూలన కోసం గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ వికె రాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.అమెరికాకు చెందిన డాక్టర్ లీలారాజు విశిష్ట అతిథులను పరిచయం చేయడంతో పాటు సదస్సు ప్రాధాన్యతను వివరించారు. అలాగే వివిధ విద్యాసంస్థలకు చెందిన ఆప్తాల్మిక్ మెడికోలు మరియు విద్యార్థులు వివిధ అంశాలపై ప్రదర్శనలు అందించారు. కేస్ స్టడీ ప్రజెంటేషన్ల విజేతలకు గౌతమి ఐ ఇన్‌స్టిట్యూట్ మరియు జిజియు ఛాన్సలర్ కె.వి.వి. సత్యనారాయణ రాజు నగదు పురస్కారాలను అందజేసారు. ఈ సదస్సులో గౌతమి ఎండి శ్రీ వివి కుమార్,డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి,జిఎస్ఎల్ వైద్య కళాశాల డాక్టర్ గురునాథ్,నయన కంటి ఆసుపత్రి కి చెందిన డాక్టర్ శ్రీరామ్, వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన నేత్ర వైద్యులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం: కిరణ్ కుమార్

విశాలాంధ్ర -రాజమండ్రి : కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారుకు ఆంధ్రప్రదేశ్ అంటే ఎంత చిన్నచూపో మరోసారి పార్లమెంట్ సాక్షిగా ఈ బడ్జెట్ రుజువు చేసిందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాజమండ్రి నగర కార్యదర్శి పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో నామమాత్రం మాదిరిగానే ఈసారి కూడా కనీసం ఆంధ్రప్రదేశ్ అనే పదమే ఉచ్చరించలేదని. ఈ బడ్జెట్‌లోనైనా కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ వైపు కన్నెత్తైనా చూస్తుందేమో అని 5 కోట్ల ప్రజలు ఎదురుచూశారన్నారు. అందరి ఆశలపై కేంద్ర ప్రభుత్వం మళ్లీ నీళ్లు చల్లిందన్నారు. రానున్న ఎన్నికల కోసం బీహార్‌కు బంగారు వల్లెంలో వడ్డించి.. ఆంధ్రప్రదేశ్ మాత్రం అన్యాయం చేసిందన్నారు. ఏపీకు ఐఐటీ, ఐఐఎం, ఐసర్, ఎన్ఐడీ, ట్రిపుల్ ఐటీ , గిరిజన విశ్వవిద్యాలయం, పెట్రో విశ్వవిద్యాలయం, వంటి ఉన్నత విద్యా సంస్థల్లో ఏదీ ఇవ్వకపోవడం ఇక్కడి విద్యార్థులకు, యువతకు, వారి తల్లిదండ్రులకు తీవ్ర అన్యాయం చేయడమే అన్నారు. దేశ అత్యున్నత చట్టసభలో హామీ ఇచ్చిన విభజన హక్కులను కూడా కేంద్ర ప్రభుత్వం నెరవేర్చకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. బీజేపీని ఇకపై రాష్ట్ర ప్రజలు నమ్మరన్నారు. ఆహార సబ్సిడి , విద్య , ఉపాధి హామీ తో పాటు ఆర్థిక సంస్కరణలు, అములు చేస్తునే ప్రజల మీద నిధులు రుణాలు అని షరతులు పెట్టడం ప్రజల మీద మరిన్ని భారాలు పడుతాయన్నారు.. కేవలం బీజేపీ పాలిత రాష్ట్రాలకు పెద్దపీట వేసి, బడ్జెట్లో ఇతర రాష్ట్రాలకు అన్యాయం చేయడం సరైన సంస్కృతి కాదన్నారు.

ఎమ్మార్పీఎస్ సభ విజయవంతం చేయండి: రావెళ్ల

విశాలాంధ్ర-పెద పారుపూడి: ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం గత 30 సంవత్సరాలు పైబడి చేస్తున్న పోరాటానికి నాంది పలికే నిమిత్తం ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో జరుప తలపెట్టిన లక్షల డప్పులు, వేల గొంతులతో సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు కృష్ణా జిల్లాలో గత వారం రోజులుగా మండలాలు, గ్రామాలలో పర్యటిస్తూ ముందుకు సాగుతున్న ఎంఈఎఫ్ జిల్లా నాయకులు రావెళ్ల వరుణ కుమార్ పెదపారుపూడిసెంటర్లో ఆదివారం పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ కుటుంబాలలో కనీసం ఇంటికి ఒకరైన వెసులుబాటును బట్టి హైదరాబాద్ సభకు విచ్చేసి జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులకు విజ్ఞప్తి చేశారు.ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గంపల గూడెం: జిల్లాలోని గంపలగూడెం మండలం పెనుగొలను లో ఆదివారం జిల్లా సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు డెంటల్ ,షుగర్ ,బీపీ, జనరల్ మొదలైన 220 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తిరువూరు సత్య సాయి సేవ సమితి కన్వీనర్ దామెర ప్రభాకర్ రావు, కమిటీసభ్యులు జి. నరసింహారావు,వి వెంకటరెడ్డి,యస్ ఏర్పాటును పర్యవేక్షించారు.

ముద్రగడపై దాడిని జనసేన పార్టీకి ఆపాదించడం సరికాదు

విశాలాంధ్ర రాజమహేంద్రవరం : ఆదివారం తెల్లవారుజామున వైసీపీ నాయకులు ముద్రగడ పద్మనాభం ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తి చేసిన దాడిని జనసేన పార్టీకి ఆపాదించడానికి ముద్రగడ పద్మనాభం కుమార్తె శ్రీమతి ముద్రగడ క్రాంతి, జనసేన పార్టీ రాజమండ్రి అధ్యక్షులు వై. శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు.

రాజమహేంద్రవరంలో ముద్రగడ క్రాంతి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వై. శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యక్తిగత ద్వేషాలతో రాజకీయాలు చేయడం జనసేన పార్టీ మూల సిద్ధాంతాలకు, పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచన విధానాలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తులను లక్ష్యంగా చేసే దాడులను జనసేన పార్టీ వ్యతిరేకించడమే కాకుండా అటువంటి సంఘటనలను పార్టీలకు అతీతంగా ఖండించడం జరిగిందన్నారు. ముద్రగడ పద్మనాభం ఇంటి వద్ద జరిగిన దాడి పై ప్రముఖ టీవీ చానల్స్‌లోను, సామాజిక మాధ్యమాల్లోనూ రకరకాలుగా ట్రోల్స్ జరుగుతున్నాయని ఈ విషయమై పూర్తి వివరణ ఇవ్వడానికి మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం కుటుంబాల మధ్యన విభేదాలు సృష్టించడం జనసేన పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధం కనుక ఎన్నికల ముగిసిన తర్వాతనే ముద్రగడ క్రాంతిని పార్టీలోనికి అధ్యక్షులు తీసుకున్నారని తెలిపారు. ముద్రగడ కాంతి మాట్లాడుతూ దాడి విషయం తెలియగానే బాధ కలిగించిందని, ఇలాంటి ఘటనలు ఎవరి మీద జరగరానివని తెలుపుతూ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనను ఆసరాగా తీసుకొని జనసేన పార్టీపై బురద జల్లడానికి ప్రయత్నించడం వైసీపీ నాయకులకు సరికాదన్నారు. ఎవరు ఎందుకు దాడి చేశారనే విషయాన్ని, దాని వెనుకున్న కుట్రలపై పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేసి నిజాలను బయటపెట్టాలని కోరారు. నీతి నిజాయితీలతో పార్టీ నడుపుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేసి రాజకీయంగా లబ్ధి పొందేందుకే కిరాయి మూకలతో ఈ దాడికి ఎవరైనా పాల్పడ్డారనే కోణంలో కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రజలందరికీ పవన్ కళ్యాణ్ వాస్తవిక వ్యక్తిత్వం తెలుసునని ఇటువంటి ఆరోపణలు నమ్మే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు జామి సత్యనారాయణ, దాసరి గురునాథం, రాజేష్ ఖన్నా, షేక్ బాషా, అక్కిరెడ్డి ప్రసాద్,, ముమ్మిడి భాగ్యలక్ష్మి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలను రైతు సంఘం నాయకుల పరిశీలన

విశాలాంధ్ర-గంపలగూడెం : ఆంధ్రప్రదేస్ రైతుసంఘం గంపలగూడెం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నల్లనల్లివల్ల నష్టపోయిన మామిడి, మిరప తోటలను మండలం లోని అనుము ల్లంక, కనుమూరు గ్రామాల్లో పరశీలించటం జరిగినది. సాగుచేసిన రైతులు మాట్లాడుతు గత 5 సం లుగా నల్లనల్లీవల్ల పూర్తిగా నష్టపోతున్నమని నష్టపరిహారం, పంటల భీమా వర్తింపచేయాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఆద్యక్షులు మద్దిరెడ్డి. వెంకటరెడ్డి ,పండ్ల తోటల కమిటీ ఆధ్యక్షులు చెరుకు. వీరారెడ్డి, జి. వీరభద్రం, డి. బాస్కరరెడ్డీ, పి. రాజగోపాల్ రెడ్డి , జి. నరశిహరావు తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా అను మైబేబీ 3వ వార్షికోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): త్వరలో అమ్మలు కాబోతున్న మహిళలు.. ర్యాంప్‌పై తళుక్కుమన్నారు. పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న స్త్రీమూర్తుల ఆత్మవిశ్వాసం ర్యాంప్ వాక్ ను మరింత అందంగా మార్చింది. అను మై బేబీ 3వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం వినూత్నంగా నిర్వహించారు. ఎనికేపాడు అను మై బేబీ హాస్పిటల్ నందు జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ తార పూర్ణ.. కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ, పాశ్చాత్య వస్త్రధారణతో కాబోయే అమ్మలు ర్యాంప్ వాక్ చేయడం స్ఫూర్తి దాయకంగా నిలిచింది. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ.. అను మై బేబీ వార్షికోత్సవ సంబరాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కాబోయే అమ్మల ర్యాంప్ వాక్‌లో భాగస్వామ్యం కావడం తనకు అద్భుతమైన అనుభూతినిచ్చిందని తెలిపారు. శక్తి స్వరూపిణి అయిన దుర్గమ్మ కొలువుదీరిన విజయవాడ నగరంలో నారీ శక్తికి నిజమైన నిదర్శనంగా ఈ కార్యక్రమం నిలిచిపోతుందని ఆమె వ్యాఖ్యానించారు. అనంతరం, అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీదేవి మాట్లాడుతూ.. అను మై బేబీ మూడేళ్ల ప్రస్థానంలో అనేక మైలురాళ్లను అధిగమించిందని అన్నారు. విశిష్టానుభవం కలిగిన వైద్య నిపుణులతో, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అను మై బేబీలో వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. అనేక క్లిష్టమైన కేసుల్లో సైతం తమ వైద్యులు అత్యంత నైపుణ్యంతో చికిత్స నందించి చరిత్ర సృష్టించారని తెలియజేశారు. అను మై బేబీలోని ప్రపంచ స్థాయి సదుపాయాల ద్వారా హైరిస్క్ ప్రెగ్నెన్సీ, వాటర్ బర్త్, పెయిన్ లెస్ డెలివరీ సేవలను అందిస్తున్నామని వెల్లడించారు. సేఫ్ హాండ్స్ ప్రోగ్రామ్ ద్వారా 80 కి.మీ. పరిధిలో ఎమర్జెన్సీ నియో నేటల్ చికిత్సలను అందుబాటు లోకి తెచ్చామన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఒకే ఒక్క ఫోన్ కాల్ ద్వారా నవజాత శిశువులకు అత్యాధునిక అత్యవసర చికిత్సలను అందిస్తామని తెలిపారు. ఇందు కోసం వెంటిలేటర్, తదితర వసతులతో అంబులెన్స్, ప్రత్యేక ఎన్ఐ సీయూ విభాగం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అను మై బేబీ వార్షికోత్సవ స్ఫూర్తితో, ప్రజలందరికీ నాణ్య మైన వైద్య సేవలందించాలనే తమ లక్ష్య సాధనలో పునరంకితమవుతామని డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ర్యాంప్ వాక్ లో పాల్గొన్న గర్భిణీలను హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి.రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అను మై బేబీ వైద్యులు డాక్టర్ కవిత, డాక్టర్ పావని, డాక్టర్ మంజు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతే విజయ సూత్రం

దిగ్గజ క్రికెటర్, మోటివేషనల్ స్పీకర్ జాంటీ రోడ్స్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఐక్యతే విజయానికి మూలసూత్రమని, బృంద స్ఫూర్తితో కృషి చేయడం ద్వారా అద్భుత విజయాలను సాధించవచ్చని దిగ్గజ క్రికెటర్, ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ జాంటీ రోడ్స్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ నందు ఆదివారం జరిగిన బీఎన్ఐ నెట్వర్కింగ్ కాంక్లేవ్ 3.0లో ఆయన కీనోట్ ప్రసంగం చేశారు. క్రికెట్ ఆటలో అసాధారణ ఫీల్డింగ్ నైపుణ్యానికి చిరునామాగా ఖ్యాతి గడించిన జాంటీ రోడ్స్ ప్రసంగం.. బీఎన్ఐ సదస్సుకు హాజరైన వాణిజ్యవేత్తల్లో స్ఫూర్తి నింపింది. బీఎన్ఐ నెట్వర్కింగ్ కాంక్లేవ్ 3.0లో జాంటీ రోడ్స్ మాట్లాడుతూ.. క్రికెట్ మైదానంలో జట్టు సభ్యులందరూ సమన్వయంతో ఆడితే విజయం సాధించినట్లుగానే, వ్యాపార రంగంలోనూ పరస్పర సహకారంతో విజయ పథంలో దూసుకెళ్లవచ్చని అన్నారు. సమయానుకూల నిర్ణయాలు, సత్వర కార్యాచరణతో అద్భుత విజయాలు సాధ్యమవుతాయని చెప్పారు. మార్కెట్ సరళిని ఎప్పటికప్పుడు విశ్లేషించుకుంటూ, పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. వాణిజ్యవేత్తల నడుమ అనుబంధాన్ని పెంపొందించి, సభ్యులందరి వ్యాపార వృద్ధికి మహత్తర వేదికగా బీఎన్ఐ నిలుస్తుందని అన్నారు. బీఎన్ఐ కాంక్లేవ్ ద్వారా ఏర్పరుచుకున్న అను బంధాలను కొనసాగిస్తూ వ్యాపార రంగంలో పురోగమిస్తూ, దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడాలని జాంటీ రోడ్స్ పిలునిచ్చారు. బీఎన్ఐ విజయవాడ చాప్టర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నెట్వర్కింగ్ కాంక్లేవ్ 3.0లో 1500 మందికి పైగా ప్రముఖ వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. వేర్వేరు అంశాలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో నూతన వ్యాపార అవకాశాలు, వాణిజ్య వ్యూహాలపై విశ్లేషణాత్మక చర్చలు జరిగాయి. వ్యాపారవేత్తల నడుమ అనుబంధం కొనసాగేలా అధునాతన సాంకేతిక వ్యవస్థను బీఎన్ఐ తీర్చిదిద్దిందని బీఎన్ఐ విజయవాడ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జై దేశాయ్, విశాల్ దేశాయ్ తెలిపారు. బీఎన్ఐ నెట్వర్కింగ్ కాంక్లేవ్ 3.0 విజయవంతంగా నిర్వహించడం ద్వారా బీఎన్ఐ విజయవాడ చాప్టర్ ప్రతిష్ట మరింత ఇనుమడించిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ నెట్వర్కింగ్ కాన్క్లేవ్ 3.0 చైర్మన్ మేఘన ఆచంట, మెంటార్ నండూరి త్రినాథ్, కన్వీనర్ పి. యువ కిషోర్, ట్రెజరర్ మద్దినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-పమిడిముక్కల: ఐనంపూడిలో పూరాతనమైన శ్రీ రుక్మిణీ సత్య భామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం జీర్ణోద్ధరణ చేసి నూతన ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్టా మహెూత్సవ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణు గోపాలస్వామి, శ్రీ గోదాదేవి, శ్రీ అభయాంజనేయ స్వామి, ధ్వజ స్థంభ శిఖర ప్రతిష్టా కార్యక్రమం శ్రీవైఖానసాగమం ప్రకారం ఆచార్య పరాశరం కృష్ణ ప్రసాద్ యాజ్ఞీక పర్యవేక్షణలో ఎకకాలంలో జరుగుతుందని తెలిపారు.

దోమలు దండయాత్ర..
ప్రజలు బెంబేలు..

- అంత అంత మాత్రంగానే పారిశుధ్య నిర్వహణ
- పంచాయతీ కార్యదర్శులను నియమించాలి

విశాలాంధ్ర - సీతానగరం: గ్రామాల్లో దోమల దండయాత్రలో ప్రజలు బెంబేలు. మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీల పరిధిలో 20 సచివాలయలతో ప్రజా పాలన జరుగుతుంది. 20 పంచాయతీలకు సరిపడా పంచాయతీ కార్యదర్శులు లేకవడం, అదేవిధంగా డిజిటల్ అసిస్టెంట్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మేజర్ పంచాయతీలు సైతం అప్పగించారు. ఇది కాక చాలా పంచాయతీలలో పారిశుధ్య కార్మికులు సరిపడా లేక పోవడంతో పారిశుధ్య నిర్వహణ అంత అంత మాత్రంగానే జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పంచాయతీలో సాధారణంగా రద్దీగా ఉండే కూడలలో బ్లీచింగ్ పౌడర్ జల్లుతూ పారిశుధ్య నిర్వహణ చేసేవారు. అలాగే గ్రామాల్లో డ్రేణిజిలా వద్ద దోమల నివారణ మందులు హాబిట్‌ను స్ప్రేలు, ఫాగ్ మిషెన్ల ద్వారా పొగను పారిశుధ్య కార్మికులు పిచికారీ చేసేవారు. దీంతో ప్రజలకు జనవరి, ఫిబ్రవరి, మార్చ్ నెలల్లో దోమలు ఎక్కువగా ఉండే కాలంలో ప్రజలకు ఉపశమనం కలిగేది. ఇప్పుడు ఏ పంచాయతీలో దోమల నివారణ చర్యలు చేపట్టకపోవడం ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటుకు ప్రజలు జ్వరాల బారిన పడుతున్నామని, ముసలి వారికి, చిన్న పిల్లలు పై దోమ కాటు తీవ్ర ప్రభావం చూపుతుంతోదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయాలను అధికారులు గుర్తించి గ్రామాల్లో పంచామతీ కార్యదర్శులను నియమించడం, దోమల నివారణకు చర్యలు పటిష్టంగా చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీఎం చంద్రబాబుకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఘన స్వాగతం

విశాలాంధ్ర ప్రతినిధి ఏలూరు: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎన్డీఏ కూటమికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ఆదివారం దిల్లీకి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని దిల్లీ ఎయిర్ పోర్ట్ లో సహచర ఎంపీలతో కలిసి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పుష్పగుచ్చాలు అందజేసి ఘనస్వాగతం పలికారు.

భవన్నారాయణస్వామి ఆలయంకు భక్తులు

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : సర్పవరం పంచాయతీ స్వయంభు భవన్నారాయణస్వామి ఆలయంలో మాఘ మాసం మొదటి ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకున్నారు. మాఘమాసం ఆదివారాన్ని భక్తులు ఎంతో పవిత్రంగా జాతర చేస్తారు. ఈ మాసంలో నాలుగు ఆదివారాలు ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజులు ఈ రోజున గుడి ఆవరణలో గల పరిసరాల ప్రాంతాల్లో ఆవు పిడకలపై ఆవు పాలు పొంగించి పొంగలి చేసి స్వామివారికి నివేదించిన తర్వాత భక్తులకు ప్రసాదంగా పంచడం ఆనవాయితీ ఈరోజు తెల్లవారే భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ అధికారులు మరియు పోలీస్ సిబ్బంది భక్తులకు ఏ ఇబ్బంది రాకుండా పర్యవేక్షించారు. ముఖ్యఅతిథిగా కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ భవనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసినట్లుగా ఆలయ ఈవో మచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

సీఐ ప్రశాంత్ ఉదారతతో
బాధితుడికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - అమలాపురం : ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పర్రపేటకు చెందిన కుంచె అనిల్ అనే వ్యక్తికి శుక్రవారం రాత్రి లారి ఢీ కొని కాలు తెగి పడిపోవడంతో తీవ్ర గాయాలు అయి కాకినాడలో ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం చేయించేందుకు డబ్బులు లేక కుటుంబం ఎదురు చూస్తూ ఆక్సిడెంట్ చేసిన లారిని ఆపి స్థానికులు ఆందోళన చేపట్టారు. ఆ సమయంలో అక్కడకు వెళ్లిన అమలాపురం రూరల్ సిఐ ప్రశాంత్ కుమార్ మానవత్వంతో ఆలోచించి ముందు బాధితుడికి వైద్యం చేయించండి అంటూ తన వంతు సాయంగా రూ.20 వేల అందించారు. దీంతో ఎవరికి తోచిన సాయం వారు చేయండి ఆనడంతో అక్కడే ఉన్న తహసీల్దార్ వివిఎస్ దివాకర్ రూ.10 వేలు, ఎస్ఐ రాజేష్ రూ.10వేలు, స్థానిక నాయకులతో పాటు అందరూ ఎవరికి తొసిన సాయం వారు చేసి రెండు లక్షలకు పైగా డబ్బులు పోగుచేసి గాయపడిన వ్యక్తికి వైద్యం కోసం అందించారు. సిఐ ప్రశాంత్ ఉదారతను అందరూ కొనియాడుతున్నారు. ఆయన చూపిన ఔదార్యం ఎందరో మానవతా వాదుల స్పందనకు కారణమయ్యిందని సీఐ సేవానిరతి పలువురి ప్రశంసలు అందుకుంది. అన్ని రంగాల ప్రముఖులు జిల్లా అధికారులు సిఐ ప్రశాంత్‌ను అభినందిస్తున్నారు.

మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు కొండపై మేరీమాత ఆలయంలో మేరీమాత ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు స్థానిక వరుపుల సత్య ప్రభ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో, మన నియోజకవర్గలో పేరు ప్రఖ్యాతిగాంచిన మేరీ మాత ఉత్సవాలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమరాది వెంకట్రావు, టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి పల్లా గోపి, సిబిఎన్ ఆర్మీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ యళ్ల జగదీష్, దాట్ల అప్పనబాబు, కొట్టేటి అబ్బులు, ఎన్డీఏ శ్రేణులు పాల్గొన్నారు.

సాయి సందీప్‌కు విశిష్ట సేవ రత్న పురస్కారం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏలేశ్వరంకు చెందిన స్పార్క్ (సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకడమిక్ అండ్ రీసెర్చ్ క్యాబ్) సంస్థ చైర్మన్ ఎస్ సాయి సందీప్‌ను మేడిద సుబ్బయ్య ట్రస్ట్ విశిష్ట సేవా పురస్కారంకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా రాజమండ్రి సితార గ్రాండ్స్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు మేడిది వెంకటేశ్వర రావు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పార్క్ సంస్థ సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సులు, వర్క్ షాపులు, సెమినార్లతో పాటు పోలీస్‌శాఖతో మమేకమై అనేక సేవా కార్యక్రమాలు, సైబర్ నేరాలపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుండడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగులకు పాలు పంపిణీ

విశాలాంధ్ర - రాజోలు : ఇస్లాం మత వ్యవస్థాపకుడు హజరత్ మహమ్మద్ ప్రవక్త మనవడైన ఇమామ్ హుస్సైన్ జయంతి సంధ్భంగా నగరం గ్రామానికి చెందిన గరోహె మొహిబ్బానె జహెర అనే సంఘం వారు ఆదివారం రాజోలు ప్రభుత్వాసు పత్రిలో రోగులకు బ్రెడ్, పాలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఇమామ్ హుస్సేన్ సూచించిన ఉపదేశాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రూహి, మస్తాన్ అలీ, ముజ్తబా హైదర్, అజీబ్ హుస్సేన్, మీర్ ఫయాజ్ అలీ, జాఫర్ హుస్సేన్, జాఫర్ అబ్బాస్, ముబష్షిర్ రజా, మొహమ్మద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - సామర్లకోట : పంచరామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన సామర్లకోట భీమేశ్వరస్వామి నిత్య అన్నదాన పథకానికి రాజమండ్రికి చెందిన జి రామా రావు వాణి దంపతులు రూ.1లక్ష విరాళం అందించారు. ఆదివారం శ్రీ పంచమి సందర్భంగా స్వామివారిని దర్శించిన రామారావు దంపతులు ఆలయ ఈవో బల్ల నీలకంఠంకు విరాళం అందించారు. ఈవో, సూపరింటెండెంట్ ఈశ్వరరావు ఆలయ అర్చకులు సన్నిధిరాజు వెంకన్న, దాతలకు వేద ఆశీస్సులు, చేయించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు.